
సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 4 । మార్చి । 2025





ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.9 /17.1

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘ప్రజావాణిని వినియోగించుకోవాలి’

కామారెడ్డి అర్బన్ : ప్రతి సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సూచించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు విద్యుత్ ప్రజావాణికి 445 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 400 ఫిర్యాదులను పరిష్కరించామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని సర్కిల్, డివిజన్, ఈఆర్వో, సబ్ డివిజన్, సెక్షన్ ఆఫీసుల్లో ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు.

‘అంకితభావంతో పనిచేయాలి’



కామారెడ్డి టౌన్: నిరంతరం క్రమశిక్షణతో, అంకిత భావంతో పనిచేసినపుడే తగిన గుర్తింపు లభిస్తుందని డీఈవో రాజు సూచించారు. ఇటీవల డీఎస్సీ- 2024 ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులకు దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొత్త ఉత్సాహంతో పనిచేస్తూ ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా ప్రమాణాలు పెంచడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అకడమిక్ అధికారి వేణుగోపాల్, ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశం, రిసోర్స్ పర్సన్స్ ప్రమోద్ రాజ్, దత్తు రాజ్, లింబాద్రి, చిన్నం నాయుడు, భవాని, జరీనా బేగం, రజని తదితరులు పాల్గొన్నారు.

‘సస్యరక్షణ చర్యలు పాటించాలి’



సదాశివనగర్: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి హోన్నప్ప గౌడ సూచించారు. సోమవారం ధర్మారావ్‌పేట్ గ్రామంలో రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి, ఏవో ప్రజాపతి, ఏఈవో శ్రీనివాస్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో సీఎంఆర్ పూర్తి చేయాలి



కామారెడ్డి క్రైం: సీఎంఆర్ ప్రక్రియను వేగంగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. 2023-24 రబీ, 2024-25 ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ సేకరణలో భాగంగా మిల్లులను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వేగంగా సీఎంఆర్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలసత్వం ప్రదర్శించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సకాలంలో సీఎంఆర్ పూర్తి చేయని మిల్లర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. 2023-24 రబీ సీజన్‌లో 1,22,064 టన్నులు డెలివరీ చేసి 58 శాతం పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన 94,295 టన్నుల సీఎంఆర్‌ను ఈనెల 17 వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. 2024-25 ఖరీఫ్‌కు సంబంధించి సీఎంఆర్ సేకరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం ప్రకారం ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి చేయవలసిన బియ్యంలో జిల్లా వాటా 3 వేల టన్నుల సీఎంఆర్ సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, పౌరసరఫరాల డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగవుతున్న వరి



పంటలు గట్టెక్కేనా?

- నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- చివరి ఆయకట్టుకు నీరందడం లేదని అన్నదాతల ఆందోళన
- అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- పంటలు గట్టెక్కిస్తామంటూ రైతులకు భరోసా కల్పించే యత్నం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు విడతల వారీగా నీటి విడుదల కొనసాగుతోంది. అయితే చివరి ఆయకట్టుకు నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదుకోవాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు కాలువలను పరిశీలిస్తూ రైతులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. పంటకు అవసరమైన నీటి కోసం ఇప్పటికే మూడు విడతల్లో నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నాలుగో విడత కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు రోజూ 2,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఈ నీరు డిస్ట్రిబ్యూటరీల చివరి వరకు అందకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీటి కోసం అధికారుల నిర్బంధం

నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. కానీ ప్రధాన కాలువ పరిధిలోని వర్ని, చందూర్, జాకోరా, రుద్రూర్, కోటగిరి, బోధన్ ప్రాంతాల్లోని పొలాలకు నీళ్లు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఎగువన ఉన్న రైతులు ఎక్కువ నీటిని వినియోగించుకుంటుండడంతో ఈ పరిస్థితి వచ్చిందని తెలుస్తోంది. కాలువకు నీటి విడుదలను పెంచాలని రైతులు కోరుతున్నారు. కాగా పంటలకు నీరు అందడం లేదంటూ ఇటీవల బోధన్ ప్రాంత రైతులు నీటిపారుదల శాఖ అధికారులను నిర్బంధించారు. అలాగే నీరందక పంటలు ఎండిపోతున్న విషయాన్ని బీర్కూర్, వర్ని ప్రాంత రైతులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన పోచారం.. రాత్రి వేళలో కాలువలపై పర్యటించి, పరిస్థితిని అధికారులతో సమీక్షించారు. చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూడాలని సూచించారు. డి-26 ఉప కాలువ కింద ఎక్కువ విస్తీర్ణంలో ఆయకట్టు ఉందని, చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లాలంటే కనీసం 3 ఫీట్లు తగ్గకుండా ఉప కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. అలాగే బోధన్ ఎమ్మెల్యే సైతం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నందున చివరి ఆయకట్టు గట్టెక్కేవరకు నీటిని విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు నీరు వృథా కాకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.



నిజాంసాగర్ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

మూడు విడతల్లో 6 టీఎంసీలు..

ఆయకట్టుకు నీరందించేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. 10 రోజులు ఆన్, ఆఫ్ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతోంది. డిసెంబర్ 13న నీటి విడుదల ప్రారంభమైంది. ఇప్పటివరకు మూడు విడతల్లో 6టీఎంసీల నీటిని ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు అందించారు. ప్రస్తుతం నాలుగో విడత నీటి విడుదల కొనసాగుతోంది. నాలుగో విడతలో ఇప్పటివరకు 1.481 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

నీరు దుర్వినియోగం కాకుండా..

నిజాంసాగర్ ఆయకట్టు ప్రాంత రైతుల ఆందోళనల నేపథ్యంలో జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ సోలోమాన్, డిప్యూటీ ఈఈ, ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు రాత్రి వేళలో ప్రధాన కాలువను తనిఖీ చేస్తున్నారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, చందూర్, జాకోరా, రుద్రూర్, కోటగిరి, బోధన్ మండలాల్లో ఆయా డివిజన్ల అధికారులు కాలువలను సందర్శించి, నీరు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

“ అక్రమంగా నీటిని తరలిస్తున్నారు

నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఒక పక్కన మోటార్లు ఏర్పాటు చేసి అక్రమంగా నీటిని తరలిస్తున్నారు. బాన్సువాడ, వర్ని, జాకోరా, చందూర్, రుద్రూర్ అక్రమంగా నీటిని తోడేస్తున్నారు. సుమారు 20 వేల ఎకరాలకు అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నారు. దీంతో డిస్ట్రిబ్యూటరీల చివరి వరకు నీరందడం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం.

– శ్రీనివాస్, జిల్లా నీటిపారుదలశాఖ సీఈ

టీచర్ స్థానంలో కమలం పాగా



పట్టభద్రుల స్థానం ఓట్లను విభజిస్తున్న సిబ్బంది



కొమురయ్యకు స్వీట్ తినిపిస్తున్న బండి సంజయ్

- తొలి ప్రాధాన్యత ఓట్లతోనే ఎమ్మెల్సీగా గెలిచిన మల్క కొమురయ్య
- కొనసాగుతున్న పట్టభద్రుల స్థానం ఓట్ల విభజన

సాక్షిప్రతినిధి,కరీంనగర్ : నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ టీచర్ నియోజకవర్గం కమలం వశమైంది. తొలిప్రాధాన్యం ఓట్లతోనే మల్క కొమురయ్య టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో విజయం సాధించారు. నల్గొండ టీచర్ ఎన్నికల ఫలితాలు సాయంత్రానికే వచ్చేసినా.. కరీంనగర్ టీచర్ ఎన్నికల లెక్కింపు సాయంత్రానికి మొదలవడం గమనార్హం. కౌంటింగ్ ప్రారంభించిన రెండు గంటల్లోనే ఫలితం తేలింది. టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 27,088 ఓట్లకు గాను 25,041 ఓట్లు పోల్ అవగా.. అందులో 24,144 చెల్లుబాటు అయ్యాయి. 897 ఓట్లు చెల్లలేదు. దీంతో గెలుపు కోటా ఓట్లు 12,073గా నిర్ధారించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు 12,959, వంగ మహేందర్‌రెడ్డికి 7,182, అశోక్‌కుమార్‌కు 2,621, రఘోత్తంరెడ్డికి 428 ఓట్లు వచ్చాయి.

ఆర్వో, సిబ్బందిపై మండిపాటు

గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న పలువురు అభ్యర్థులు రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో), లెక్కింపు సిబ్బందిపై మండిపడ్డారు. లెక్కింపు ప్రక్రియ మందకొడిగా సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలైన ఓట్లలో కొందరు 01, 02 అని వేసిన వారి ఓట్లు పరిగణనలోకి తీసుకోవాలని పట్టభద్రుల స్థానానికి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు.

బండి అభినందనలు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాత్రి 10.20 గంటల సమయంలో కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చి మల్క కొమురయ్యను అభినందించారు. ఇది చరిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మేధావి వర్గమంతా మోదీపై నమ్మకంతో ఉన్నారన్నారు. ఈ తీర్పు టీచర్లకు, మోదీకి అంకితమని వ్యాఖ్యానించారు.

కొనసాగుతున్న ‘గ్రాడ్యుయేట్’ విభజన

సోమవారం ఉదయం నుంచి గ్రాడ్యుయేట్ ఓట్ల వడపోత కొనసాగుతూనే ఉంది. ఉదయం 8 గంటలకు మొదలు పెట్టిన ఎన్నికల లెక్కింపు, చెల్లని, చెల్లిన ఓటర్ల విభజనపై రాత్రి 9గంటలు దాటేవరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. అప్పటి వరకు దాదాపు లక్ష ఓట్లను వడబోయగా అందులో 92,000 చెల్లుబాటు అయ్యాయని, 8,000 ఓట్లు చెల్లలేదని, మిగిలిన 1.5 లక్షల ఓట్ల వడబోత మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు.



టీచర్ ఎమ్మెల్సీ స్థానం ఓట్లను లెక్కిస్తున్న కౌంటింగ్ సిబ్బంది

విత్తన బంతుల తయారీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్‌కార్ప్స్ సహకారంతో విద్యార్థులు సోమవారం విత్తన బంతులను తయారు చేశారు. 20 రకాల విత్తనాలను సేకరించి దాదాపు వెయ్యి విత్తన బంతులను తయారు చేశామని వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డి తెలిపారు. ఈ విత్తన బంతులను ఎండబెట్టి, నిల్వ చేసి జూన్ మూడో వారంలో అటవీ శాఖ చూపించిన ప్రదేశంలో వేస్తామని పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థ, అడవులను పరిరక్షించడంపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించడం ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించవచ్చని పాఠశాల హెచ్ఎం శ్రీనాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రాజు, సరిత, సుజాత, శ్రీమతి, ప్రసన్నలు పాల్గొన్నారు.



విత్తన బంతులు తయారుచేస్తున్న విద్యార్థులు

ఎల్ఆర్ఎస్‌కు నెలాఖరు వరకు గడువు

కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని అనధికారిక లేఅవుట్ ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ రాజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020లో రూ. 10 వేలు, వేయి రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం ఈనెల 31వ తేదీలోపు 25 శాతం తగ్గింపు రుసుముతో క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. అనధికారిక లేఅవుట్ ప్లాట్ల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

- ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రూ. 10 వేల డిమాండ్
- అవినీతి నిరోధక శాఖకు పట్టించిన బాధితుడు



ఏసీబీకి పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామరాజు, స్వీపర్ రంగుసింగ్ వెంకట్‌రావు

ఖలీల్‌వాడి : నిజామాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని అర్బన్ సబ్ రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు, స్వీపర్ రంగ్‌సింగ్ వెంకట్రావులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. అయితే లంచం ఇచ్చిన బాధితుడి వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం బాధితుడు సోమవారం ఉదయం 11.50 గంటలకు సబ్‌రిజిస్ట్రార్ చెన్నమాధవేణి శ్రీరామరాజు వద్దకు వెళ్లగానే డాక్యుమెంట్‌ను కౌంటర్‌లో ఇవ్వాలని, లంచం డబ్బులు స్వీపర్ రంగ్‌సింగ్ వెంకట్రావుకు ఇవ్వాలని చెప్పారు. బాధితుడు డాక్యుమెంట్లను కౌంటర్‌లో ఇచ్చి అనంతరం స్వీపర్ వెంకట్రావును కలిశారు. బాధితుడిని స్వీపర్ వెంకట్రావు కార్యాలయ అధికారులు భోజనం చేసే గదిలోకి తీసుకువెళ్లి రూ.10 వేలు తీసుకుని జేబులో పెట్టుకొగానే అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్‌రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు డబ్బులు డిమాండ్ చేయడంతో కెమికల్ పూసిన రూ.10 వేలు ఇచ్చినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. స్వీపర్ వెంకట్రావును పట్టుకున్న అనంతరం విచారణ జరిపి సబ్‌రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరిని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ప్రభుత్వ శాఖల్లో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే బాధితులు ఎవరైనా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని ఏసీబీ డీఎస్పీ కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏసీబీ దాడుల సందర్భంగా కార్యాలయంలో రెండుగంటల పాటు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారి డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతనే లోనికి అనుమతి ఇచ్చారు. వెయిటింగ్ హాల్ నుంచే సబ్‌రిజిస్ట్రార్-1 రిజిస్ట్రేషన్లు చేశారు.

సబ్‌రిజిస్ట్రార్-2 శ్రీరామరాజు ఆదిలాబాద్ జిల్లా బోథ్ నుంచి నిజామాబాద్‌కు బదిలీపై వచ్చారు. మొదట్లో ఇక్కడి డాక్యుమెంట్ రైటర్లతో వివాదం జరిగింది. రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ గత నవంబర్‌లో డాక్యుమెంట్ రైటర్లు ధర్నా చేశారు. గతంలో రామరాజును నిర్మల్ జిల్లా భైంసాలో పని చేస్తున్న సమయంలో ఇల్లీగల్ డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలపై ఆదిలాబాద్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. అధికారుల విచారణలో ఇల్లీగల్ డాక్యుమెంట్లుగా తేలడంతో అక్కడ రామరాజును సస్పెండ్ చేసినట్లు సమాచారం.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- రేపటి నుంచి ప్రారంభం
- పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు
- తొలిసారిగా సీసీ కెమెరాలతో పర్యవేక్షణ





కామారెడ్డి ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా, కమాండ్ కంట్రోల్ రూం

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను తొలిసారి నిఘా నీడలో నిర్వహించబోతున్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బుధవారంనుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ప్రారంభమయ్యే పరీక్షలు ఈనెల 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

జిల్లాలో 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణ కేంద్రాల్లో 20 కేంద్రాలు ఉండగా, రూరల్‌లో 18 కేంద్రాలున్నాయి. ఇటీవల ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రాల్లో హైరిజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు ప్రభుత్వం నిధులను విడుదల చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించింది. అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఉండడంతో థియరీ పరీక్షలనూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించబోతున్నారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా పరీక్షలను ఇంటర్ బోర్డు అధికారులు పర్యవేక్షించనున్నారు. మాల్ ప్రాక్టీస్ నిరోధానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

18,472 మంది విద్యార్థులు

జిల్లాలో 38 కేంద్రాలలో 18,472 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 8,743 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 9,729 మంది హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 38 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 38 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఏరోజుకారోజు ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి బందోబస్తుతో కేంద్రాలకు తీసుకువస్తారు.

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు


ఇంటర్	జనరల్	వొకేషనల్	మొత్తం
ఫస్టియర్	6,828	1,915	8,743
సెకండియర్	8,339	1,390	9,729
మొత్తం	15,167	3,305	18,472

ఎస్ఎంఎస్‌తో హాల్‌టికెట్ డౌన్‌లోడ్..

ఇప్పటి వరకు హాల్‌టికెట్‌లను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే వారు. ప్రాక్టికల్స్ పరీక్షల సమయం నుంచే విద్యార్థి మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ లింక్ పంపి దాన్ని క్లిక్ చేయడం ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఇదే అవకాశాన్ని వార్షిక పరీక్షలకూ అన్వయించారు. కొన్ని కళాశాలల్లో ఫీజులు కట్టకపోతే హాల్ ఇవ్వకుండా వేధించేవారు. ఎస్ఎంఎస్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఇవ్వడం ద్వారా ఇంటర్ బోర్డు ఆ పరిస్థితికి చెక్‌పెట్టింది.

సౌకర్యాలు కరువు

పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని కేంద్రాలలో సౌకర్యాలు లేవు. ఎండాకాలం కావడం, ఫ్యాన్‌లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశాలున్నాయి. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని విద్యాభిమానులు కోరుతున్నారు.



కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో పనిచేయని ఫ్యాన్

“ అన్ని ఏర్పాట్లు చేశాం



ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. 38 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. ఈసారి సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. బోర్డు అధికారులు నేరుగా సీసీ కెమెరాల ద్వారా పరీక్షల తీరును పర్యవేక్షిస్తారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.

– షేక్ సలాం, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

క్లుప్తంగా

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలు, సైబర్‌నేరాలు, రోడ్డుభద్రత, మైనర్‌డ్రైవింగ్, బాల్యవివాహాలు తదతర వాటిపై అవగాహన కల్పించారు. మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువుపై దృష్టి సారించాలన్నారు.వాట్సాప్‌లో వచ్చిన మెసెజ్‌లకు ఆకర్షితులు కావద్దని, తొందరగా ఎవరికి లొంగిపోవద్దని సూచించారు. ఏమైన ఘటనలు జరిగినట్లయితే 100 నంబరుకు ఫోన్ చేసినట్లయితే తగిన సహాయాన్ని అందిస్తామన్నారు. ప్రిన్సిపల్ సురేఖ, షీటీం ప్రతినిధులు సుప్రజ, అనిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో జరుగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం, టీజేఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాంకు వినతిపత్రం అందజేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పరీక్ష కేంద్రంలో వేసవి కాలం దృష్ట్యా తాగునీరు, ప్రతి తరగతి గదిలో ఫ్యాన్ ఉండే విధంగా చూడాలన్నారు. నాయకులు నీల నాగరాజు, లక్ష్మణ్ యాదవ్‌లు ఉన్నారు.

రేపు ప్రయోగాల ప్రదర్శన సదస్సు



తెయూ(డిచ్‌పల్లి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5న జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగాల ప్రదర్శన సదస్సు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ ప్రసన్న శీల తెలిపారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రసన్న శీల మాట్లాడుతూ సదస్సుకు తెయూ పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగ పద్ధతులు,అందుకు ఉపయోగించే పరికరాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని వీసీ, రిజిస్ట్రార్‌లు సూచించారు. కార్యక్రమంలో సదస్సు కోకన్వీనర్ కిరణ్మయి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సాగు నీరందేలా చూడాలి

- నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: అధికారులు అప్రమత్తంగా ఉంటూ పంటలకు సక్రమంగా సాగు నీరు సరఫరా అయ్యేలా పర్యవేక్షించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. యాసంగి పంటల సంరక్షణ చర్యల్లో భాగంగా రాబోయే పది రోజులు ఎంతో కీలకమన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ సాగు నీరు, విద్యుత్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. భారీ నీటి పారుదల శాఖ పరిధిలోని రిజర్వాయర్లలో అవసరమైన మేర సాగునీరు అందుబాటులో ఉందన్నారు.

విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రాజెక్టుల నుంచి విడుదల చేసిన ప్రతి నీటి చుక్కను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి నుంచి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, డీఏవో తిరుమల ప్రసాద్, పౌరసరఫరాల శాఖ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి


ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 52 వినతులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. 52 ఫిర్యాదులు వచ్చాయి. భూముల సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతు భరోసా, మున్సిపల్ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, మున్సిపల్ రోడ్ల ఆక్రమణ, తదితర అంశాలపై మొత్తం 52 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగులో ఉన్న ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు అనుమతివ్వండి సార్..!


మద్నూర్ కళాశాలలో విద్యార్థులు, వారి తండ్రులు

మద్నూర్(జుక్కల్): ఇంటర్ ద్వితీయ సంతవ్సరం పరీక్షలు రాయడానికి అనుమతివ్వండి సార్ అంటూ దివ్యాంగ విద్యార్థులు, వారి తండ్రులు సోమవారం మద్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ పాండురంగాను వేడుకున్నారు. వివరాలు.. మండలంలోని హండేకేలూర్ గ్రామానికి చెందిన అప్పస్‌వార్ పండరి కుమారుడు దేవిదాస్(చేతులు పనిచేయవు), మద్నూర్‌కు చెందిన చౌడేకర్ గంగాధర్ కుమారుడు అవినాష్(గుడ్డి), కోడిచిరకు చెందిన బేతే హన్మంత్ కుమారుడు రాములు(చేతులు పనిచేయవు).. మద్నూర్‌లోని రాంసుఖ్ బాల్‌ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరు ముగ్గురూ దివ్యాంగులు కావడంతో మరొకరి సహకారంతోనే పరీక్ష రాయగలరు. మొదటి సంవత్సరంలో ఇంటర్ బోర్డు అనుమతితో పరీక్షలు రాశారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి కూడా ఇంటర్ బోర్డుకు దరఖాస్తు చేసుకోగా అనుమతి రాలేదని వారు వాపోయారు. ఈ విషయమై జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలాం దగ్గరకు వెళ్లి విషయం వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరీక్షలకు అనుమతి ఇస్తామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారన్నారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు మొదలవుతున్న తరుణంలో తమ పిల్లలకు అనుమతి లేదని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ తెలపడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమ పిల్లలకు ఇంటర్ పరీక్షలకు అనుమతి ఇవ్వాలని వారు కోరారు.

అధికారుల నిర్లక్ష్యం.. మొక్కలకు శాపం



వన నర్సరీలపై అధికారుల పర్యవేక్షణ లేక నర్సరీల్లోనే మొక్కలు ఎండుతున్నాయి. నిజాంసాగర్ మండలంలోని మల్లూర్ తండా గ్రామ పంచాయతీలో గతేడాది వన నర్సరీలో 10 వేల మొక్కలు ఉత్పత్తి చేశారు. పర్యవేక్షణ లేక ఇలా పూర్తిగా ఎండిపోయాయి.

– నిజాంసాగర్ (జుక్కల్)

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక


దండు అకుల్

భిక్కనూరు: సిద్దరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన దండు అకుల్ అనే విద్యార్థి జాతీయ స్థాయి ఆర్చరీ క్రీడలకు సోమవారం ఎంపికయ్యాడు. కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ -12 విభాగంలో పాల్గొని జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యాడని కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. అకుల్ రెండేళ్లుగా దోమకొండ గడికోటల్లో కోచ్ ప్రతాప్‌దాస్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్నాడు. పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

మహిళ కడుపులో 7 కిలోల కణతి

- జీజీహెచ్‌లో ఆపరేషన్
- మూడు గంటలు శ్రమించి తొలగించిన వైద్యులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన రేణుక(47) ఆరు నెలలుగా తీవ్రంగా కడుపునొప్పి, రక్తస్రావంతో బాధపడుతోంది. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం, పరీక్షలు చేయించుకుంది. ఆమె కడుపులో పెద్ద గడ్డ(కణతి) ఉందని వైద్యులు నిర్ధారణ చేశారు. ఆపరేషన్ చేయడానికి రూ.లక్షకు పైగా ఖర్చు అవుతుందని నెల క్రితం తెలిపారు. పేదరికంతో ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేక మూడు రోజుల క్రితం కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించింది. వైద్యులు ఆమెను పరీక్షించి, స్కానింగ్, ఇతర పరీక్షలు చేసి సోమవారం ఆపరేషన్ చేశారు. మూడు గంటల పాటు వైద్యులు శ్రమించి ఆమె కడుపులో ఉన్న 7 కిలోల కణతిని విజయవంతంగా తొలగించారు. ఈ గడ్డ ఎలా పెరిగిందో తెలుసుకునేందుకు బయాప్సీ పరీక్షకు పంపించినట్లు వైద్యులు 'సాక్షి'తో తెలిపారు. ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు, వైద్యులు రాంసింగ్, పార్థసారథి, సహజ, నవీన్, వెంకట్‌లను వైద్యాధికారులు అభినందించారు. రేణుక కుటుంబ సభ్యులు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి మనిషిలో కవి దాగుంటారు

- కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయ్ కుమార్

కామారెడ్డి అర్బన్ : తెలుగు సాహిత్యంలో కవిత్వం మనిషిని ఉన్నతుడిగా మార్చడానికి ఉపయోగపడుతుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'కవితా రచన మెలకువలు' అంశంపై ఒక రోజు కార్యశాల నిర్వహించగా ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి, రచయిత డాక్టర్ కాసర్ల నరేష్‌రావు హాజరై మాట్లాడారు. ప్రతి మనిషిలో కవి దాగుంటారని, కాల పరిస్థితులకు అనుగుణంగా ప్రతిస్పందిస్తాడన్నారు. కవిత్వం రాయడానికి మెలకువలను తెలిపారు. కార్యశాలలో తెలుగు విభాగం అధ్యక్షుడు పి.విశ్వప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, హిందీ విభాగం అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు కె.రవికుమార్, జి.మల్లేషం, ఎన్. ఆంజనేయులు, డిగ్రీ, పీజీ తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పోటీ శిబిరం


విజేతలకు బహుమతులను అందజేస్తున్న పశువైద్యాధికారి సంతోష్ కుమార్

పిట్లం(జుక్కల్): గౌరారంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం దూడల ప్రదర్శన, పాల ఉత్పత్తి పోటీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మండల పశువైద్యాధికారి సంతోష్ కుమార్ దూడలకి నట్టల మందులు ఇచ్చారు. అనంతరం పాల ఉత్పత్తి పోటీలు నిర్వహించి ఏ గేదెలు అయితే ఎక్కువ పాలు ఇచ్చాయో వాటికి బహుమతులను పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. బహుమతులతో పాటు దూడలకు నట్టల మందులను రైతులకు అందజేశారు. గోపాలమిత్ర సూపర్వైజర్ తిరుపతి, గోపాలమిత్ర సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో ఆరోగ్య శిబిరం

రాజంపేట: రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జంగంపల్లి కేజీబీవీ వసతి గృహంలో సోమవారం ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు రాజంపేట వైద్యాధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని 45 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి 42 మంది విద్యార్థులకు మందులు అందజేశారు. అనంతరం వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మంజూర్, తదితరులు పాల్గొన్నారు .


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

క్రికెట్ టోర్నీలో రన్నరప్‌గా జిల్లా జట్టు


ట్రోఫీతో జిల్లా జట్టు క్రీడాకారులు

కామారెడ్డి టౌన్: మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్‌లో జరిగిన టీ10 అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు ప్రతిభ చూపింది. ఫైనల్ మ్యాచ్ పోరులో రన్నరప్‌గా నిలిచింది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ట్రోఫీని జిల్లా జట్టు అందుకుంది. కామారెడ్డి క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ధన్‌రాజ్, జిల్లా జట్టు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి గోస తీర్చండి సారూ..


పెద్దకొడప్‌గల్‌లో కుళాయి వద్ద బారులు తీరిన రెడ్డికాలనీవాసులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండల కేంద్రంలో రెడ్డి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు అందరూ మోటార్లు పెట్టడంతో మా కాలనీకి భగీరథ నీరు రావడంలేదని వారు వాపోతున్నారు. గతంలో మిషన్ భగీరథ నీరు వచ్చే సమయంలో కరెంట్ తీయించి నీటిని వదిలేవారు. ఇప్పుడు ఆ సమయంలో కరెంట్ తీయకపోవడంతో వచ్చేనీరు కూడా రావడంలేదంటున్నారు. నెల రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని, మా కాలనీలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్ చెడిపోయిందని, వెంటనే మరమ్మతులు చేయించమని పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి


పేకాట స్థావరంపై దాడి చేసిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, స్పెషల్ పార్టీ పోలీసులు ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ ఆదేశాలతో సోమవారం దాడి చేశారు. విఠలేశ్వర్ నగర్ రైస్‌మిల్ పక్కన పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ. 2,450, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

ఇనుప చువ్వల కోసం వెళ్లి ఒకరి మృతి


చెరువులో పడి మృతి చెందిన నాగంరవి

నందిపేట్(ఆర్మూర్): ఇనుప చువ్వల కోసం చెరువులోకి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించాడు. నందిపేట ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నాగం రవి(52) వృత్తిరీత్యా గోడలకు సున్నాలు వేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం నందిపేట బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఊర చెరువులో వినాయక విగ్రహాల ఇనుప చువ్వల కోసం దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగం రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ..


చికిత్స పొందుతూ మృతి చెందిన స్వరూప

ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ గ్రామ శివారులో శనివారం రాత్రి కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో పూల్‌సింగ్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో గాయపడిన స్వరూప(32) హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలు

కమ్మర్‌పల్లి: మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఓవ్యక్తికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ ఆర్మూర్ కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి నెల్లి సరళరాణి తీర్పు వెలువరించారు. కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని మండల కేంద్రానికి చెందిన తుదిగేన దేవేందర్‌పై 2019లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. విచారణ అనంతరం పోలీసులు నిందితుడిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన ప్రథమశ్రేణి న్యాయమూర్తి నెల్లి సరళరాణి సోమవారం తీర్పు వెలువరించారు. సాక్ష్యాలను ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్ రాజును ఎస్సై అనిల్‌రెడ్డి అభినందించారు.

ఆస్తి కోసం తండ్రిపై దాడి

- చికిత్స పొందుతూ మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన వల్లకాటి లింగం(48) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 17న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తన తండ్రి లింగంను కొట్టినట్లు కొడుకు శేఖర్ డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని లింగంను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఘటనపై కొడుకు శేఖర్ చెప్పే మాటలకు పొంతన లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో తానే ఆస్తి కోసం తండ్రిని గాయపర్చినట్లు ఒప్పుకున్నాడు. శేఖర్ కొంతకాలం క్రితం తండ్రి వద్ద నుంచి వెళ్లి హైదరాబాద్‌లో ఉంటుండగా, లింగం శెట్పల్లిలో నివసిస్తున్నాడు. కొద్దిరోజులుగా శేఖర్ ఆస్తి కోసం తండ్రితో గొడవ పడుతున్నట్లు తెలిపారు. 15 రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన లింగం సోమవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. శేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

మోపాల్: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మద్యం తాగి కారు నడుపుతున్న ఒకరితోపాటు బైక్ నడుపుతున్న మరొకరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ద్విచక్రవాహనాలు నడిపిస్తున్న 23 మందికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై రమేశ్‌బాబు, హెచ్‌సీ గంగాధర్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

రెంజల్(బోధన్): రెంజల్ మండలం తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన జంగం నవీన్ (36) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన నవీన్ గ్రామ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని గుర్తించిన రైతులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అక్క శోభ ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు సంవత్సరాలుగా భార్యకు దూరమైన నవీన్ మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించి మతిస్థిమితం కోల్పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు..

కమ్మర్‌పల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన జల్లెండ్ల మల్లు(64) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మరణించింది. మృతురాలి కొడుకు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన సాకలి మెత్కు సాయిలు(45) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాయిలు ఇటీవల కూతురు పెళ్లి చేయగా అప్పులు పెరిగిపోయాయి. దీంతో మద్యానికి బానిసైన సాయిలు తన చేను వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు..

కామారెడ్డి క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఈ ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేకువజామున 1 గంటల ప్రాంతంలో రైల్వేస్టేషన్ యార్డు వద్ద పట్టాలపై ఓ గుర్తుతెలియని యువకుడి మృతదేహం పడి ఉండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 25–30ఏళ్ల మధ్య ఉంటుందని, ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు కార్గో ప్యాంటు, తెలుపు రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు ఎవరైనా ఉంటే కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం


మామిడిపల్లిలోని పెయింట్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ శాఖ అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతోపాటు పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. తక్కువ మైక్రాన్ల సాంద్రత కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని దుకాణాదారులకు జరిమానా విధించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది అక్షయ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.